# ఆగమాగం

- జడ్పీ కాంప్లెక్స్ షాపుల అడ్డగోలుగా నిర్వహణ
- ఏళ్ల తరబడి అద్దె బకాయిలు... అడిగేవారేరి..?
- టెండర్లు లేకుండానే షాపుల కేటాయింపు
- అద్దె వసూళ్లలో ఎవరి వాటా వారిదే..??
- జడ్పీ సీఈఓ దృష్టి సారిస్తారా...!

**శామ్, మార్చి14(కెరటం ప్రతినిధి)**

అడిగేవారు లేరని అడ్డగోలుగా వ్యవహరిస్తారు ఇక్కడ. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ప్రబుద్ధులు ఉన్నంతవరకు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతుంది అనడానికి ఇది ఒక నిదర్శనం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయానికి సంబంధించిన జడ్పీ కాంప్లెక్స్ షాపుల వ్యవహార శైలి చూస్తుంటే.. విస్తు పోయే నిజాలు బయటికి వస్తున్నాయి. గత కొంతకాలం క్రితం ఉమ్మడి ఖమ్మం జిల్లాగా ఉన్నప్పుడు ఏర్పడిన కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయానికి సంబంధించి జెడ్పి కాంప్లెక్స్ పరిధిలో సుమారు 30 షాపులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ షాపులను దక్కించుకునేవారు ప్రభుత్వపరంగా పిలిచిన టెండర్లకు అనుగుణంగా టెండర్ వేసి దక్కించుకోవలసి ఉంటుంది. గతంలో ఈ తరహా వ్యవహారం చక్కగా కొనసాగినప్పటికీ నూతనంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత జిల్లాల పునర్విభజనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా ఏర్పడిన నాటి నుంచి కొత్తగూడెం లోని జిల్లా పరిషత్ కార్యాలయానికి సంబంధించిన కాంప్లెక్స్ షాపుల వ్యవహారం అధికారులు గాలికి వదిలేసినట్లు కనపడుతుంది. భద్రాద్రి జిల్లా ఏర్పడిన తర్వాత వ్యాపార సముదాయాలు పెరిగి ఆయా షాపులకు అద్దె రేట్లు రెక్కలు వచ్చాయి. జడ్పీకి సంబంధించిన కాంప్లెక్స్ షాపులు విచ్చలవిడిగా అడ్డగోలుగా ఎవరు పడితే వారు వాడుకుంటూ అద్దె చెల్లించడంలో మాత్రం ముందుకు రావడం లేదు. దీంతో జడ్పీ కాంప్లెక్స్‌లోని ఒక్కొక్క షాపు సుమారు ఐదు సంవత్సరాల నుంచి ఎలాంటి టెండర్ లేకుండా అధికారుల అనుమతి లేకుండా కొందరు ఆ షాపులను ధారాదత్తం చేసుకుని మరొకరికి అద్దెకు ఇస్తూ జేబులు నిప్పుకుంటున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేమిటి అని అడిగితే కొందరు



దౌర్జన్యాలకు దిగుతూ మేమింతే చేస్తాం మమ్మల్ని అడిగే వారే లేరు అంటూ హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నట్టు వినికిడి. ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లలో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి అనేక రకాలైన వ్యాపారాలను జోరుగా కొనసాగిస్తూనే ప్రభుత్వానికి చెల్లించాల్సిన అతి తక్కువ అద్దె చెల్లించకుండా ఎగనామం పెడుతున్నారన్న వార్తలు వినవస్తున్నాయి. దీంతో జిల్లా పరిషత్ కార్యాలయానికి రావలసిన ఆదాయం కూడా కొందరి ప్రబుద్ధుల జేబులోకి వెళుతున్న అధికారులు కిమ్మనకుండా ఉండడం వెనక పలు అనుమానాలు కలుగక మానవు.

**అనుమతులు లేకుండానే షాపుల కేటాయింపు**

కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ కార్యాలయానికి సంబంధించిన బాబు క్యాంప్ సమీపంలోని జడ్పీ కాంప్లెక్స్‌ల షాపులు అధికారుల అనుమతులు లేకుండానే కొందరు అక్రమంగా వ్యాపారాలు నిర్వహించడమే కాకుండా మరొక అడుగు ముందుకు వేసి ఆ షాపులను సైతం మరొకరికి అద్దెకు ఇచ్చి ఆ డబ్బులను దర్జాగా తీసుకెళు తుండడం విశేషం. గతంలో కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రభుత్వం కొన్ని షాపులను సీజ్ చేసి తాళాలు వేసినప్పటికీ ఆ తాళలను సైతం పగలగొట్టి ఎలాంటి టెండర్లు పిలవకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు లేకుండా కొందరికి అద్దెకి ఇవ్వడం చూస్తుంటే ఆ షాపుల కు సంబంధించిన అద్దె డబ్బులు అన్ని అడ్డదారిలో కొందరి జేబుల్లోకి వెళ్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెం జిల్లా కేంద్రం కావడంతో రోడ్డుకు సమీపంలో ఉన్న షాపులు కిరాయికి దొరకాలంటే ముందస్తుగా అడ్వాన్స్ రూపంలో ఐదు లక్షలు చెల్లించడమే కాకుండా నెలకు వద్ద రూ.20 వేల నుంచి రూ.25 వేల రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. కొత్తగూడెం జిల్లా పరిషత్‌కు సంబంధించిన షాపులను టెండర్ ద్వారా దక్కించుకుంటే అతి తక్కువగా అద్దె రూపంలో చెల్లించాల్సి ఉంది. అయినప్పటికీ జడ్పీ కాంప్లెక్స్ షాపులు కొందరు ప్రబుద్ధులు అక్రమంగా దక్కించుకొని టెండర్ గిండర్ జాంతానై అద్దె చెల్లించడమా హా.. హా.. హా అంటూ ఓ ప్రబుద్ధుడు తిరిగి జవాబు ఇవ్వడం వెనుక జిల్లా పరిషత్ చైర్మన్ అండదండల జిల్లా పరిషత్ సీఈఓ అనుమతులా.. తెలియదు గాని జడ్పీ కాంప్లెక్స్ షాపులకు అధికారులు అధికారికంగా టెండర్లు నిర్వహించరు అద్దె వసూళ్ల విషయంలో పట్టించుకోరు.

**షాపుల స్వాధీనానికి జిల్లా చైర్మన్ కు లేఖ రాశాం**

కొత్తగూడెం జిల్లా పరిషత్‌కు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల కేటాయింపుల వ్యవహారం తనకు తెలియదని, అధికారికంగా ఎలాంటి అద్దె వసూళ్లకు పాల్పడడం లేదని గతంలో జెడ్పీకి సంబంధించిన షాపులను తిరిగి స్వాధీనం చేసుకోనేందుకు సంబంధిత జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యకు గడిచిన మూడు నెలల క్రితమే లేఖ రాశామని అనుమతులు రాగానే షాపులు సాధనం పరుచుకుని టెండర్లు నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో మెరుగు విద్యాలత వివరణ ఇచ్చారు.

**మేరుగు విద్యాలత**
**జడ్పీ సీఈవో...**

# తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

**బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్**

**శామ్, మార్చి14(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్య పాత్ర పోషించిన ఉద్యమకారులను ఆదుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పట్టణంలోని ఉద్యమకారుల సంక్షేమకారుల ఆధ్వర్యంలో మంగళవారం





భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఉద్యమకారుల నిరసనకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులను కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ ప్రజల్లో మొట్టమొదటిగా దగా పడింది ఉద్యమకారులేనని ఆరోపించారు. ఉద్యమకారులను ఇకనైనా ఆదుకోవాలని, వారికి ఉపాధి చూపించాలని, ఆరోగ్య భీమాను వర్తింప జేయాలని, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రతీ సంక్షేమ పథకంలో ఉద్యమకారులకు ప్రత్యేక కోటా కల్పించాలని డిమాండ్ చేశారు.కవితను ఈడీ విచారణకు పిలిపిస్తే ఆమెకు మద్దతుగా మంత్రి వర్గంలో ఉన్న తన కుటుంబ సభ్యులు కేటీఆర్, హరీశ్ రావు లతో పాటు అనేకమంది మంత్రులు, కార్యకర్తలను ఢిల్లీకి పంపించి సంఘీభావం తెలిపేందుకు ప్రయత్నించిన తీరు యావత్తు తెలంగాణ సమాజానికి విస్మయానికి గురిచేసిందన్నారు. కూతురు విషయంలో ఒకలా, ఉద్యమకారుల విషయంలో మరోలా వ్యవహరించడం కేసీఆర్ కు తగదని ఇప్పటికైనా ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రషీద్,బరిగడ దేవదానం, హుస్సేన్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు నబీ,తెలంగాణ విభిన్న ప్రతిభవంతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్ గుండప నేని, గౌస్,ఉబ్బెన శ్రీను,ఐలయ్య తదితరులు పాల్గొన్నారు



## కోల్ ఇండియాలో పతకం గెలిచిన క్రీడాకారిణి

**అభినందించిన జిఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సి బసవయ్య**

**శామ్, మార్చి14(కెరటం ప్రతినిధి)**

జిఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె. బసవయ్య తన కార్యాలయ ఛాంబర్‌లో డబల్యూపిఎస్ అండ్ జిఏ ఆధ్వర్యంలో ఎన్‌సిఎల్‌లో జరిగిన కోల్ ఇండియా లెవెల్ అథ్లెటిక్స్ పోటీలో విజేతగా నిలిచిన రమావత్ బుజ్జి 50 మీటర్ల పాట్ రేస్‌లో కాంస్య పతకం గెలిచి సింగరేణి సత్తా కోల్ ఇండియా లెవెల్‌లో చాటినందుకు జిఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె. బసవయ్య మంగళవారం రమావత్ బుజ్జిని అభినందించి చెక్కును ప్రదానం చేసారు. కోల్ ఇండియా స్థాయిలో పతకాలను గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్పొరేట్ ఏరియా హనరరీ సెక్రెటరీ అండ్ సీనియర్ పిఓ గట్టు స్వామి, స్పోర్ట్స్ సూపర్వైసర్ దార్ల సుందర్ రాజు, అసిస్టెంట్ స్పోర్ట్స్ సుపర్వైసర్ ఎంసి పాస్నెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందనడానికి ఇదొక నిదర్శనం అని పునరుద్ఘాటిస్తూ, క్రీడాకారులకు ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు కంపెనీ అన్ని విధాలుగా సహకరిస్తుందని వారు నైపుణ్యంతో క్రీడలలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం పర్సనల్ కె శ్రీనివాస రావు, సీనియర్ పిఓ సుశీల్ కుమార్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సుపర్వైసర్ ఎంసి పాస్నెట్, యాక్టింగ్ పిఏ పి.ప్రభాకర్, కుమారి రజిత తదీతరులు పాల్గొన్నారు.